# ఆర్వో ప్లాంట్లు.. చుక్క నీరివ్వక పాట్లు

**మనిషి బతికేందుకు కావాల్సిన తప్పనిసరి వనరులు గాలి, నీరు, ఆహారం. ఇందులో తాగునీటి ప్రాధాన్యం గురించి చెప్పాల్సిన పనిలేదు. చాలా రోగాలకు మూల కారణం కలుషిత నీరే. అందుకే సురక్షిత తాగునీటి సరఫరా పథకాలకు ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తున్నాయి. అయితే పరవాడ మండలంలో సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి కేంద్రాలు మూలకు చేరాయి. పట్టించుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు మంచినీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు.**

- సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో ఏర్పాటు
- నిర్వహణ లేక మూలకు చేరిన మూడు ప్లాంట్లు
- స్థానిక ప్రజలకు తప్పని తాగునీటి ఇక్కట్లు

పరవాడ: గ్రామీణ ప్రజలకు శుద్ధి చేసిన తాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం రూ.లక్షలు వెచ్చించి వాడచీపురుపల్లి, కలపాక, దేశపాత్రునిపాలెం గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణను గాలికి వదిలేయడంతో కొన్నాళ్లుగా మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటి కోసం చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.



ఏడాది నుంచి మూలకు చేరిన వాడచీపురుపల్లి ఆర్వో ప్లాంట్

## దూరాభారం తప్పని స్థితి

2015లో కలపాక గ్రామ ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తీర్చేందుకు ఎన్టీపీసీ యాజమాన్యం రూ.11.20 లక్షల వ్యయంతో శుద్ధి చేసిన తాగునీటిని అందించే ఆర్వో ప్లాంట్‌ను నిర్మించింది. కొన్నేళ్ల పాటు ఈ ప్లాంటు ద్వారా శుద్ధి చేసిన తాగునీటిని గ్రామస్తులకు అందించారు. ప్లాంటు మరమ్మతులకు గురయ్యాక దీన్ని పట్టించుకోవడమే మానేశారు. పూర్తిగా మూలకు చేరింది. దీంతో స్థానికంగా ఉన్న కలుషిత నీటినే తాగాల్సి వస్తోంది.



ఆరేళ్లుగా పనిచేయని కలపాక ఆర్వో ప్లాంట్

శుద్ధి చేసిన నీటి ప్రాధాన్యత తెలిసిన వారు కాస్త దూరంగా ఉన్న ఎన్టీపీసీ కొళాయి, పి.బోనంగిలోని ప్రైవేట్ ఆర్వో ప్లాంట్లపై ఆధారపడుతున్నారు. దూరాభారంతో పాటు, అదనపు ఖర్చు కూడా తప్పనిసరయిందని ప్రజలు వాపోతున్నారు.

## మూలకు చేరి ఏడాది

2016లో సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు రూ.7.50 లక్షలతో మండలంలోని వాడచీపురుపల్లిలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా అప్పట్లో వాడచీపురుపల్లి పరిసర గ్రామాల ప్రజలకు తాగునీటి సౌకర్యం లభించేంది. గతేడాది క్రితం వరకు ఈ పథకం బాగానే పనిచేసింది. 20 లీటర్ల నీటిని రూ.5కే అందించే వారు. ఆ తర్వాత ప్లాంట్ మిషనరీలో తలెత్తిన లోపాల కారణంగా మూలకు చేరింది. అప్పటి నుంచి పంచాయతీ ప్రజలకు తాగునీటి ఇక్కట్లు మొదలయ్యాయి. ప్రైవేట్ ఆర్వో ప్లాంట్ల నుంచి నీటిని కొనుగోలు చేయాలంటే రూ.20 వరకు వసూలు చేస్తున్నారు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్లాంట్ మూలకు చేరిందని స్థానికులు ఆరోపి స్తున్నారు.

## ఆరంభం నుంచీ అవస్థలే

జీవీఎంసీ పరిధిలోని దేశపాత్రునిపాలెంలో నిర్మించిన ఆర్వో ప్లాంట్‌కు ఆది నుంచీ అవస్థలే. 2018లో ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు రూ.11.63 లక్షల వ్యయంతో దీన్ని నిర్మించారు. నిర్వహణ లోపమో.. మరే కారణమో గానీ.. ఆరంభం నుంచే మరమ్మతులకు లోనయింది. దాదాపు ఆరేళ్లుగా అడపా దడపా రిపేర్లు చేయించి, అందుబాటులోకి తీసుకురావడం.. ఆ తర్వాత మళ్లీ మూలకు చేరడం రివాజుగా మారింది. దీంతో స్థానికులు దీన్ని నమ్ముకోలేక ప్రైవేట్ ఆర్వో ప్లాంట్లను ఆశ్రయించాల్సి వస్తోంది. పంచాయతీల పరిధిలో ఉన్న ప్లాంట్ల మరమ్మతులకు నిధుల సమస్య ఉందనుకున్నా.. ఇక్కడ జీవీఎంసీ పరిధి. అయినప్పటికీ అధికారుల చర్యలు శూన్యం.



దేశపాత్రునిపాలెంలో మూలకు చేరిన ప్లాంట్

### ఏడాదిగా తాగునీటి కష్టాలు



మా ఊర్లో ఉన్న మినరల్ వాటర్ కేంద్రం ఏడాది నుంచి పనిచేయట్లేదు. ఆ నీటికి అలవాటు పడిపోయాం. గతంలో రూ.5కే 20 లీటర్ల క్యాన్‌తో నీరు తెచ్చుకుంటే రెండు మూడు రోజులు సరిపోయేది. ఇప్పుడు ప్రైవేట్ వాళ్ల దగ్గర నీరు కొనుక్కోవాల్సి వస్తోంది. పైపెచ్చు దూరం నుంచి తెచ్చుకోవాలి. పంచాయతీ అధికారులు చొరవచూపి, ఆర్వో ప్లాంట్‌ను బాగుచేయించాలి.

– బంటుపల్లి లక్ష్మి, వాడచీపురుపల్లి

### మరమ్మతులు చేపట్టాలి



మా ఊరి ఆర్వో ప్లాంట్ రిపేరుకొచ్చి ఏళ్లు గడుస్తున్నా.. పంచాయతీ అధికారులు పట్టించుకోవట్లేదు. దీంతో కలుషిత నీటినే తాగాల్సి వస్తోంది. చాలా సార్లు రోగాలకు గురవుతున్నాం. గ్రామంలో ఆర్వో ప్లాంట్ పని చేయకపోవడంతో, పి.బోనంగి ఆర్వో ప్లాంట్, ఎన్టీపీసీ రైల్వే గేటు వద్దనున్న కొళాయి నీటిపై ఆధారపడుతున్నాం. అధికారులు ఆర్వో ప్లాంటుకు మరమ్మతులు చేపట్టాలి.

– ఒనుము లక్ష్మి, కలపాక

### అందుబాటులోకి తీసుకొస్తాం



మరమ్మతులకు గురై మూలకు చేరిన వాడచీపురుపల్లి, గొరుసువానిపాలెం ఆర్వో ప్లాంట్లకు రిపేర్లు పూర్తి చేశాం. త్వరలో రెండు ప్లాంట్లను అందుబాటులోకి తీసుకొస్తాం. ఆర్వో ప్లాంట్ల ద్వారా రూ.5 కే 20 లీటర్ల వాటర్ క్యాన్‌ను ప్రజలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందించాలన్న ప్రభుత్వ సంకల్పం మేరకు పనిచేస్తున్నాం.

– మురళీధర్ పట్నాయక్, పంచాయతీ కార్యదర్శి, వాడచీపురుపల్లి

## క్లుప్తంగా

### రిజిస్ట్రేషన్ హక్కుల కోసం దళిత రైతుల ఆందోళన



పెదముషిడివాడలో ధర్నా చేస్తున్న దళిత రైతులు

పరవాడ: మండలంలోని పెదముషిడివాడలో దళితులకు ప్రభుత్వం కేటాయించిన లేఅవుట్‌లోని స్థలాలకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలని కోరుతూ దళిత రైతులు ఆదివారం ఆందోళనకు దిగారు. గ్రామ రెవెన్యూ పరిధిలో దళితులకు చెందిన భూములను ల్యాండ్ పూలింగ్ కోసం గత ప్రభుత్వం సేకరించింది. భూములు కోల్పోయిన దళిత రైతులకు స్థానికంగా లేఅవుట్‌ను ఏర్పాటు చేసి అందులో స్థలాలను కేటాయించి, ఎల్పీసీలు మంజూరు చేసింది. అయితే సంబంధిత స్థలాలకు రిజిస్ట్రేషన్ హక్కులు కూడా కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాకు స్థానిక జనసేన నాయకులు బలిరెడ్డి అప్పారావు, కరణం నరసింగరావు, బొండా అచ్చిబాబు మద్దతు ప్రకటించి, రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

### ఎన్టీపీసీ జెట్టీని సందర్శించిన కలెక్టర్ కుటుంబం



తిక్కవానిపాలెం ఎన్టీపీసీ జెట్టీ వద్ద విశాఖ జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్

పరవాడ: విశాఖపట్నం జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ కుటుంబ సమేతంగా ఆదివారం సింహాద్రి ఎన్టీపీసీ జెట్టీని సందర్శించారు. తీర ప్రాంతాన్ని సందర్శించిన కలెక్టర్ కుటుంబం స్థానికంగా ఏర్పాటు చేసిన పార్క్‌లో విడిది చేసి తీర ప్రాంత అందాలను ఆస్వాదించారు. అనంతరం జెట్టీపై కాసేపు గడిపారు. తీరంలో ఏర్పాటు చేసిన పంప్‌హౌస్ పనితీరును పంప్‌హౌస్ ఆపరేటర్‌ను సోమేష్‌ను అడిగి తెలుసుకున్నారు.

### ఆవ అందాలు అద్భుతం

కొండకర్ల ఆవలో ఎస్పీ దంపతుల బోటు షికారు



కొండకర్ల ఆవలో బోటు షికారు చేస్తున్న జిల్లా ఎస్పీ దీపికా పాటిల్ దంపతులు

అచ్యుతాపురం(మునగపాక): కొండకర్ల ఆవ అందాలు ఎంతో అద్భుతమని ఎస్పీ దీపికా పాటిల్ తెలిపారు. అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల ఆవలో ఆదివారం ఆమె కుటుంబ సభ్యులతో పాటు బోటులో షికారు చేశారు. ఆవ అందాలను చూసి మంత్రముగ్ధులయ్యారు.సాయం సంధ్య వేళ ఆహ్లాదకర వాతావరణంలో ఆవలో బోటు షికారు మంచి ఆహ్లాదాన్ని కలిగించిందని ఆమె చెప్పారు.

### టీడీపీ, జనసేన నేతలు నోరు విప్పాలి

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడడానికి కూటమి ప్రభుత్వ పెద్దలు కదలి రావాలని సీపీఎం నాయకుడు సీహెచ్.నరసింగరావు కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెంలో ఆదివారం చేపట్టిన 1333వరోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని నోరు విప్పాలన్నారు. ఉక్కు యాజమాన్యం కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు గండికొడుతున్నా, డిప్యుటేషన్ల పేరుతో బెదిరిస్తున్నా నోరు మెదపకోవడం చూస్తుంటే కూటమి నేతల తీరు అనుమానాలకు తావిస్తుందన్నారు. చిత్తశుద్ధి ఉంటే వెంటనే విశాఖ ఉక్కు పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అయోధ్యరామ్, ఆదినారాయణ, రామారావు, పైడిరాజు, రామ్మోహన్‌కుమార్, జె.రామకృష్ణ, మహాలక్ష్మినాయుడు, కోమటి శ్రీనివాసరావు, జెర్రిపోతులు ముత్యాలు, వై.టి.దాస్, రమణమూర్తి, ప్రసాద్, సురేష్‌బాబు పాల్గొన్నారు.



# నిత్యాన్నదానేశ్వరీ.. మాతాన్నపూర్ణేశ్వరీ



ఎస్ఆర్ పురంలో అన్నపూర్ణగా



సుజాతనగర్లో లలితా త్రిపురసుందరిగా



శ్రమశక్తినగర్‌లో మహాలక్ష్మిగా



అన్నపూర్ణగా మహా కామేశ్వరీ ఆలయంలో



సప్తగిరినగర్‌లో గజలక్ష్మిగా



లలితా త్రిపుర సుందరిగా దుర్గమ్మ



మహాలక్ష్మిగా సహస్రాక్షి రాజరాజేశ్వరి

**అన్నం.. పరబ్రహ్మస్వరూపం. అన్నం లేనిది ప్రాణికోటికి మనుగడ లేదు. అటువంటి అన్నానికి లోటులేకుండా చూడు తల్లీ అంటూ ఊరూవాడా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు పూజల్లో అన్నపూర్ణను భక్తితో కొలిచారు. ఆలయాలు, మండపాల్లో అమ్మవారిని అన్నపూర్ణగా కొన్ని చోట్ల మహాలక్ష్మి, గజలక్ష్మి, లలితా త్రిపుర సుందరిగా అలంకరించి, పూజించారు.**

- నాలుగోరోజు వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- అన్నపూర్ణ, మహాలక్ష్మి, గజలక్ష్మి, లలితా త్రిపుర సుందరిగా దర్శనం

పెందుర్తి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెందుర్తి ప్రాంతంలోని పలు అమ్మవార్ల దేవాలయాల్లో నాలుగో రోజు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ అవతారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

- పెందుర్తి సాధూమఠం వద్ద ఉన్న మహాకామేశ్వరీ పీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి రుద్రాభిషేకం, అఖండ క్షీరాభిషేకాలు చేశారు. అన్నపూర్ణగా జగన్మాత దర్శనమిచ్చారు. హరిద్ర అర్చన ఘనంగా నిర్వహించారు.
- చినముషిడివాడ పంచముఖ గాయత్రీమాత ఆలయంలో భారీ ఎత్తున కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు చేశారు. మహాలక్ష్మిగా అమ్మవారు పూజలందుకున్నారు. వేడుకలో శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు.
- సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధిలో భారీ ఎత్తున కుంకుమ పూజలు చేశారు. అమ్మవారికి విశేష అభిషేకాలు జరిపారు. గజలక్ష్మి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు.
- మహాకామేశ్వరీ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణగా అలంకరించారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. విశేష అర్చనలు నిర్వహించారు.
- ప్రశాంతినగర్‌లోని కనకదుర్గమ్మ అన్నపూర్ణదేవిగా పూజలందుకున్నారు. సామూహిక సహస్ర కుంకుమార్చనలు జరిగాయి.
- ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరణ చేశారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ముందుగా అమ్మవారికి విశేష అర్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.
- సుజాతనగర్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరిగా అలంకరణ చేశారు. విశేష అర్చనలు, సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.



పంచముఖ గాయత్రి గుడిలో భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి



సాధూమఠం మహాకామేశ్వరి పీఠంలో హరిద్ర అర్చనలో పాల్గొన్న మహిళలు

సింహాచలం: అడవివరంలోని సింహాచలేశుని తొలిపావంచా వద్ద హవేళి ప్రాంగణంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహ యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాల్లో నాల్గవరోజు అమ్మవారు లలితా త్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. భక్తులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఉదయం గోపూజ, చండీ హోమం, శ్రీ చక్రార్చనలను వైభవంగా జరిపారు. సువాసిని పూజలు, లక్ష పసుపుకొమ్ముల నోములను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధనా పీఠంలో దసరా బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారు ఆదివారం భక్తులకు శ్రీమహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో శ్రీవిద్యారణ్య సంపుటిత శ్రీసూక్త మహాలక్ష్మీ చండీ హోమం, చండీ సప్తశతి పారాయణ, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం వీణా వాద్యం, మృదంగ నాద కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- మండలంలోని గుల్లేపల్లిలో నవరాత్రి మహోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక యువత, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఎంపీపీ బోకం సూర్యకుమారి, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, బండారు శ్రీను, బోను గంగునాయుడు తదితరులు ఉన్నారు.



గుల్లేపల్లిలో దుర్గాదేవి మండపం వద్ద మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

## అన్నపూర్ణగా శారదా స్వరూప రాజశ్యామల



అన్నపూర్ణ అవతారంలోని అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న స్వామీజీలు

పెందుర్తి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చినముషిడివాడలోని శారదాపీఠంలో శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు అన్నపూర్ణగా భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీల చేతుల మీదుగా అమ్మవారికి పూజలు జరిగాయి. సాయంత్రం కుంకుమ పూజ, సువాసిని పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి స్వామీజీ చేతుల మీదుగా ఏకాదశ హారతులిచ్చారు.

# అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

- ఘనంగా స్వర్ణపుష్పార్చన
- వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి, ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

## లిక్కర్ పాలసీలో గీత కార్మికులకు ప్రాధాన్యమివ్వాలి

పెదగంట్యాడ: కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన లిక్కర్ పాలసీలో గీత కార్మికులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని గీత సహ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు కోరారు. ఈ మేరకు సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం పాలసీలో గీత కులాలకు చెందిన సొసైటీలకు కేటాయించిన 10 శాతం రాయితీని 20 శాతానికి పెంచాలన్నారు. అలాగే టెండర్ల కోసం చెల్లించే రూ.2 లక్షలను గీత కులాలకు చెందిన సొసైటీలకు రిఫండబల్‌గా నిర్ణయించాలని ప్రభుత్వానికి విన్నవించారు. గాజువాక, పెదగంట్యాడ మండలాల్లో గీత సొసైటీలకు దుకాణాలు కేటాయించే విధంగా చూడాలని కోరారు.

## తీరం.. ఆనంద విహారం



తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. గాజువాక, అనకాపల్లి, లంకెలపాలెం, సబ్బవరం, పరవాడ, స్టీల్‌ప్లాంట్, ఎన్టీపీసీ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సందర్శకులతో తీర ప్రాంతాలు కళకళలాడాయి. ఉదయాన్నే చేరుకున్న సందర్శకులు తీరంలో ఆట పాటలతో సరదాగా గడిపారు. యువత డ్యాన్సులతో సందడి చేశారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడలలో మునిగితేలారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా తీరంలో సముద్ర స్నానాలు ఆచరించి, తిరుగుముఖం పట్టారు. – పరవాడ

## 'ప్రసాద్' పనుల పురోగతిపై ఏడీసీ సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న రామచంద్రమోహన్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో జరుగుతున్న ప్రసాద్ స్కీమ్ పనులపై రాష్ట్ర దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్(ఏడీసీ) కె.రామచంద్రమోహన్ ఆదివారం టూరిజం, దేవదాయశాఖ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. దేవస్థానంలో రూ.54 కోట్ల కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీమ్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల ప్రగతిపై అధికారులతో సమీక్షించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. సింహగిరిపై బస్టాండ్ బస్‌బే ఏర్పాటు చేయడంపై పరిశీలన జరిపారు. అక్కడ బస్ బే ఏర్పాటు చేస్తే చందనోత్సవం, ఇతర ప్రధాన ఉత్సవాల్లో ఏర్పడే రద్దీపై చర్చించారు. దీంతో ఆ ప్రాంతంలో బస్‌బే ఏర్పాటుకు విముఖత తెలిపారు. కొండదిగువ, కొండపైన జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని అధికారులను సూచించారు. ఆయన వెంట దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, టూరిజం ఏఈ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## శిథిల భవనం.. భయం భయం



కూలడానికి సిద్ధంగా ఉన్న దిబ్బపాలెం తుపాను షెల్టర్

పరవాడ: ముత్యాలమ్మపాలెం శివారు దిబ్బపాలెం మత్స్యకార్మికుల సౌకర్యార్థం 40 ఏళ్ల క్రితం నిర్మించిన తుపాను షెల్టర్ శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. తుపాన్ల సమయంలో లోతట్టు ప్రాంతంలో ఉన్న మత్స్యకార్మికుల రక్షణార్థం దీన్ని నిర్మించారు. ఈ భవనం ఆలనా పాలనా చూసే నాథుడు లేకపోవడంతో చాలా ఏళ్ల క్రితమే శిథిలావస్థకు చేరింది. దీంతో ఈ భవనం ఏ సమయంలో కూలిపోతుందోనని చుట్టుపక్కల గృహస్థులు భయపడుతున్నారు. ఇప్పటికే భవనం శ్లాబులు కూలిపోయాయి. గోడలు వర్షాలకు నానిపోయి ఎప్పుడు నేలకొరుగుతాయో తెలియని పరిస్థితి. దీన్ని తక్షణమే తొలగించి, తమకు రక్షణ కల్పించాలని దిబ్బపాలెం మత్స్యకార్మికులు కోరుతున్నారు.